నష్టాల బాటలో అరటి రైతులు

మార్కెట్‌లో పడిపోయిన ధర

- తోటల్లోనే మగ్గుతున్న పంట
- ఆందోళనలో రైతులు


ఏకపాదంపల్లిలో అరటిని లోడింగ్ చేస్తున్న దృశ్యం

తాడిమర్రి: అరటి పంటకు మార్కెట్‌లో ధర పడిపోయింది. దీంతో పంట కోయకపోవడంతో అరటి కాయలు తోటల్లోనే మగ్గుతున్నాయి. మండలంలో దాడితోట, చిల్లవారిపల్లి, నాయనపల్లి, తురకవారిపల్లి, కునుకుంట్ల, రామాపురం, ఏకపాదంపల్లి తదితర గ్రామాల్లో రైతులు అధికంగా అరటి సాగు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 200 ఎకరాలకు పైగా అరటి పంట సాగైనట్లు అంచనా. ఇక్కడ పండించిన పంటకు డిమాండ్ అధికంగా ఉంటడం, మార్కెటింగ్ సౌకర్యం ఉండటంతో రైతులు అరటి పంట సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఒకసారి మొక్కను నాటితే రెండు, మూడు కోతలు కూడా పండించు కోవచ్చు. పెట్టుబడులు ఎక్కువ అవుతున్నా ఆదాయం కూడా బాగుంటుండంతో రైతులు అరటి సాగుకు ముందుకు వస్తున్నారు.

భారీగా పెట్టుబడులు..

పంట సాగులో మొక్కలు, ఎరువులు తదితర పెట్టుబడులకు ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి రూ.2 లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. పంట బాగా పండి మంచి దిగుబడి వచ్చి సరైన గిట్టుబాటు ధర లభిస్తే ఎకరాలకు రూ.3 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఆదాయం వస్తుంది. దీంతో అధిక మంది రైతులు అరటి సాగు వైపు మళ్లుతున్నారు. గత నెల వరకు టన్ను రూ.15 వేల నుంచి రూ.18 వేలు వరకు పలికిన ధర ఒక్కసారిగా రూ.4 వేలు, రూ.5 వేలకు పడిపోయింది. దీంతో పంట పెట్టుబడులు కూడా గిట్ట లేదని రైతులు తీవ్ర కన్నీటి పర్యంతం అవుతున్నారు.

పంట కొనడానికి ముందుకు రావడం లేదు



అరటి పంటకు ధర పడిపోవడంతో పంట కొనుగోలుకు వ్యాపారులు ముందుకు రావడం లేదు. నెల వరకు టన్ను ధర రూ.16 వేలు పలికిన ధర ఉన్న ఫలంగా రూ.4 వేలకు పడిపోయింది. పంట కోతకు రావడంతో ఏడు టన్నులు కోయగా టన్ను రూ.4 వేలతో కొనుగోలు చేశారు. కనీసం పంట పెట్టుబడులు కూడా దక్కలేదు. –పీ.శివలింగారెడ్డి, చిల్లవారిపల్లి, తాడిమర్రి

తీవ్రంగా నష్టపోయా



నాకున్న నాలుగు ఎకరాల్లో అరటి పిలకలు సాగు చేశారు. పంట పెట్టుబడులకు సుమారు రూ.8 లక్షలు ఖర్చు చేశాను. పంట దిగుబడి బాగా రావడంతో పెట్టుబడులు పోగా మంచి ఆదాయం వస్తుందని ఆశించా. ఇంతలో పంటకు ధర పడిపోయింది. ఇటీవల పంటకోసి అమ్మగా రూ.5 లక్షలు వచ్చింది. దీంతో రూ.3 లక్షలు నష్టం మిగిలింది. –సీ.ఈశ్వరయ్య, దాడితోట, తాడిమర్రి

దొంగ ప్రాణాలను కాపాడిన వందేమాతరం టీం


తీవ్రంగా గాయపడిన వెంకటరమణప్ప

తనకల్లు: రైతు పొలంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలించే క్రమంతో విద్యుదాఘాతానికి గురైన దొంగ ప్రాణాలను వందేమాతరం టీం సభ్యులు కాపాడారు. పోలీసులు తెలిపిన వివరాలు... నల్లమాడ మండలం చెర్లోపల్లికి చెందిన వెంకటరమణప్ప గంగసానిపల్లికి చెందిన రైతు లక్ష్మీనారాయణ పొలంలో ఏర్పాటు చేసుకున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను దొంగలించడానికి ప్రయత్నించాడు. ఈక్రమంలో విద్యుదాఘాతానికి గురై తీవ్ర గాయాలతో అపస్మారకస్థితిలో పడిపోయాడు. విషయం తెలుసుకున్న వందేమాతరం టీం సభ్యులు బాగేపల్లి అశోక్, మహబూబ్‌బాషా (తండేల్), రాజశేఖర్‌నాయక్ తమ ఉచిత అంబులెన్స్‌లో చికిత్స కోసం క్షతగాత్రున్ని హుటాహుటినా తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు ఆసుపత్రికి చేరుకొని వివరాలను నమోదు చేసుకున్నారు. తీవ్ర గాయాలతో ఉన్న దొంగ వెంకటరమణప్పను మెరుగైన చికిత్స కోసం కదిరికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు.

పీపీపీ విధానంతో విద్యార్థులకు నష్టం

పెనుకొండ: కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీపీపీ విధానంతో మెడికల్ విద్య చదవాలన్న పేద, మధ్య తరగతి విద్యార్థులు కల ఛిద్రమైందని సోషల్ డెమోక్రటిక్ పార్టీ ఆఫ్ ఇండియా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. శుక్రవారం ఆ పార్టీ నాయకులు పట్టణంలోని మెడికల్ కళాశాలను సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెడికల్ విద్య అనేది ప్రజల కనీస హక్కు అన్నారు. ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెట్టడం అనేది ప్రజా శ్రేయస్సుకు విరుద్ధమని చెప్పారు. కోట్ల రూపాయల విలువజేసే భూములను కేవలం వంద రూపాయలకే లీజుకివ్వడం దారుణమన్నారు. నాయకులు మైలానా అంజాద్‌అలి, నూర్‌మహమ్మద్, దాదాపీర్, మొహమ్మద్‌ఉమర్, జిల్లా కమిటీ సభ్యులు అబ్దుల్ హసీబ్, అజహార్, మహమ్మద్‌వలి, షేక్ ఇమామ్, షాహిన్, సులేహ్, సమీవుల్లా, సాయి పాల్గొన్నారు.

పంటల పరిశీలన

గుడిబండ: మండలంలోని మోర్‌బాగల్ గ్రామాల్లో రైతులు సాగు చేసిన పంటలను ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు శుక్రవారం పరిశీలించారు. రైతులు సాగు చేసిన వేరుశనగ, మొక్కజొన్న, పత్తి, మిరప పంటలను చూసి రైతులకు పలు సూచనలు చేశారు. సుడిదోమ, వేరుశనగలో పచ్చపురుగు, వేరుకుళ్లు తెగులు నివారణకు వివిధ రసాయన మందులను సమయానుకూలంగా వాడాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వీరనరేష్, ఏరువాక కేంద్రం పుట్టపర్తి శాస్త్రవేత డాక్టర్ రామసుబ్బయ్య, కదిరి కృషి విజ్ఞాన కేంద్రం కీటక శాస్త్రవేత్త రమేష్ నాయక్, జిల్లా ఏడీఏ శైలకుమారి, ఏఓ చైతన్య, తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు

కదిరి టౌన్: ఆస్తి వివాదంలో మహిళను దూషించిన కేసులో ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ప్రకాశం జిల్లా కందుకూరుకు చెందిన బొమ్మిశెట్టి నాగలక్ష్మికి ఆమె బావ బొమ్మిశెట్టి రామకోటేశ్వరరావుకు మధ్య ఆస్తి వివాదం ఉంది. దీనిపై నాగలక్ష్మి పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసి తిరిగి వస్తుండగా ఆమె బావ బొమ్మిశెట్టి రామకోటేశ్వరరావు, ఆయన భార్య జయలక్ష్మి, కుమారుడు పవన్‌కుమార్ దూషించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు.

అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు

కదిరి టౌన్: కుటాగుళ్లలో మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. గ్రామంలోని బ్రాహ్మణవీధికి చెందిన సయ్యద్ యస్తాని తను ఇంటిలో టీ చేస్తుండగా అదే గ్రామానికి చెందిన అట్టుబాయ బాబ్జాన్ అక్రమంగా ఇంటిలో ప్రవేశించి అసభ్యంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వి.నారాయణరెడ్డి తెలిపారు.

మహిళ అదృశ్యం

కదిరి టౌన్: పట్టణంలోని అమీన్‌నగర్ రైల్వేట్రాక్ సమీపంలో నివాసం ఉన్న పొట్ల జయమ్మ కుమార్తె పొట్ల ఉమామహేశ్వరి అదృశ్యమైంది. వివరాలు.. ఈనెల 23న ఉదయం పొట్ల ఉమా మహేశ్వరిని తల్లి ఇంటి వద్ద ఉండాలని చెప్పి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా గాలించారు. ఫలితం లేకపోవడంతో శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమీన్‌నగర్‌కు చెందిన షర్ఫుద్దిన్ కుమారుడు బాబా ఫక్రోద్దిన్‌తో సన్నిహితంగా మాట్లాడుతూ ఉండేదని ఫిర్యాదులో పేర్కొంది. ఈ మేరకు మేరకు బాబా ఫక్రోద్దిన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ వి.నారాయనరెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

నల్లమాడ ఎంపీడీఓగా శ్రీనివాసులు



నల్లమాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓగా జీ.శ్రీనివాసులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన బత్తలపల్లి నుంచి బదిలీపై ఇక్కడికొచ్చినట్లు ఆయన తెలిపారు. ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ ఆజాద్ పదోన్నతిపై అన్నమయ్య జిల్లా కమలాపురమునకు బదిలీ అయ్యారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతన ఎంపీడీఓ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయితీ కార్యదర్శులు, పలువురు నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

‘పీఎంఎస్‌బీవై’ను సద్వినియోగం చేసుకోండి


చెక్కును లబ్ధిదారుకు అందిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన(పీఎంఎస్‌బీవై), ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి యోజనను వినియోగించుకోవాలని వెలుగు ఏపీఎం శారదరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రధాన మంత్రి సురక్షబీమా యోజన డమ్మీ చెక్కును లబ్దిదారుకు అందజేశారు. ఎగువపల్లికి చెందిన లక్ష్మన్నకు కెనరా బ్యాంక్‌లో ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన కింద రూ. 20 చెల్లించాడు. ఈయన ఏడాది ఫిబ్రవరిలో ప్రమాదవశాత్తు మృతి చెందాడు. లక్ష్మన్న నామినీ లక్ష్మీనరసమ్మ అకౌంట్‌కు ఈ నెల 4న బీమా డబ్బు రూ. 2 లక్షలు జమైనట్లు ఏపీఎం తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ అన్సారి, కౌన్సిలర్లు వీరమారుతీ, నారాయణతదితరులు పాల్గొన్నారు.

రెండిళ్లలో చోరీ

కదిరి అర్బన్: మండలంలోని నడిపపల్లి లో గురువారం రాత్రి రెండిళ్లలో చోరీ జరిగింది. వివరాలు.. మహబూబ్‌బాషా, షెక్షావలీ ఇద్దరు అన్నదమ్ములు. వీరు తమ ఇళ్లకు తాళం వేసి సమీపంలోని పశువులపాకలో నిద్రించారు. ఇదే అదనుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇంటి తాళాలు పగులగొట్టి మహబూబ్‌బాషా ఇంట్లో బీరువాలోని రూ.1 లక్ష నగదు, షెక్షావలి ఇంట్లో రూ.25 వేలు నగదు రూ.10 వేలు విలువ చేసే చిన్న ఉంగరాలు ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్ఐ రామకృష్ణయ్య తెలిపారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం


గౌనిపల్లిలో పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

ఓడీచెరువు: పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వైద్యాధికారి కమల్ రోహిత్,ఐసీడీఎస్ సూపర్ వైజర్ విజయ కుమారి పేర్కొన్నారు. శుక్రవారం గౌనిపల్లిలో పోషణ మాసోత్సవంతోపాటు స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ సిబ్బంది పౌష్టికాహార స్టాల్‌ను ఏర్పాటు చేశారు. వైద్యాధికారి మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. సీహెచ్‌ఓ ప్రమీల, ఏఎన్ఎం ఇందిరమ్మ, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

ఓడీచెరువు(అమడగూరు): అమడగూరు మండలం తుమ్మల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం స్వస్థ్ నారీ స్వశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ గంగాదేవి, వైద్యాధికారిణి అపర్ణ పౌష్టికాహారం, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ బాబా ఫక్రుద్దీన్, ఆరోగ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మృతురాలి కమ్మలు మాయం

చిలమత్తూరు: హిందూపురం ప్రభుత్వాస్పత్రిలో అమానవీయ ఘటన శుక్రవారం రాత్రి చోటు చేసుకొంది. హిందూపురం పట్టణం కోట ఏరియాకు చెందిన లక్ష్మమ్మ (80) అనారోగ్యంతో మృతి చెందింది. స్వల్ప కాల వ్యవధిలో ఆమె చెవుల్లో కమ్మలు మాయం అయ్యాయి. మృతురాలి కుమార్తె శారదమ్మ మాట్లాడుతూ మరణించిన విషయం వైద్యులు ధ్రువీకరించగానే బంధువులకు సమాచారం ఇచ్చేందుకు బయటకు వెళ్లానని, పది నిమిషాలకే ఆమె చెవిలో కమ్మలు దొంగిలించారని ఆవేదన వ్యక్తం చేశారు. సిబ్బందిని ప్రశ్నిస్తే తమకేమీ తెలియదని, శవాన్ని వదిలేసి మీరు వెళ్లడం సరికాదని చెప్పారన్నారు. ప్రభుత్వాస్పత్రిలో ఇలాంటి ఘటన చోటు చేసుకోవడం కలకలం రేపుతోంది. జిల్లా సర్వజనాస్పత్రిలో దొంగలు పడ్డారా? లేక సిబ్బంది చేతివాటమా? అన్న విషయం తేల్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

విగ్రహ ఏర్పాటుకు స్థలం చూపాలని వినతి


వినతిపత్రం అందజేస్తున్న కోటపల్లి గ్రామస్తులు

తనకల్లు: కోటపల్లిలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుకు స్థలాన్ని చూపాలని గ్రామస్థులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డీటీ మల్లికార్జునకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలోని హరిజనవాడలోని సర్వే నంబర్ 233–1లో 8 సెంట్ల భూమిని 25 ఏళ్ల క్రితం గ్రామ అభివృద్ధి కోసం కేటాయించారన్నారు. ఆ స్థలంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాడానికి గ్రామానికి చెందిన కొందరు చదువుకున్న యువకులు నిర్ణయించినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు స్థలాన్ని పరిశీలించి విగ్రహం ఏర్పాటు చేసుకోడానికి అనుమతులను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కిష్టప్ప, వేమనారాయణ, నరసింహులు, వెంకటేష్, లక్ష్మీనరసప్ప, రామచంద్ర, రవి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

బీసీల సమావేశం జయప్రదం చేయండి


మాట్లాడుతున్న వేమయ్యయాదవ్

కదిరి టౌన్: బీసీల సమస్యలపై ఈనెల 29న పుట్టపర్తిలో జరిగే సమావేశాన్ని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి వేమయ్యయాదవ్ కోరారు. శుక్రవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. గత స్థానిక ఎన్నికల్లో బీసీలకు కేటాయించిన స్థానాలను తగ్గించడంతో చాలామంది బీసీలు పదవులు కోల్పోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీల జపం చేస్తూ మరోవైపు కులగణనకు ఎందుకు ముందుకు రావడంలేదని ప్రశ్నించారు. బీసీల సమావేశానికి సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యుడు రఘువీరారెడ్డి హాజరవుతారన్నారు. సమావేశానికి బీసీలందరూ పెద్దసంఖ్యలో హాజరుకావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పవన్, మధునాయక్, రమణ, ఆదెప్ప, చలపతినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు


రోడ్డు ప్రమాదంలో గాయపడిన హనుమంతరెడ్డి

ముదిగుబ్బ: దొరిగిల్లు గ్రామం వద్ద శుక్రవారం స్కూటీ అదుపు తప్పి బోల్తా పడిన సంఘటనలో అనంతపురానికి చెందిన హనుమంతరెడ్డి గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తిని 108 సిబ్బంది మల్లేష్, కె.ఓబిలేసు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

వాహనాల తనిఖీ


వాహనాలు తనిఖీ చేస్తున్న ఎంవీఐ వరప్రసాద్

ఎన్పీకుంట: మండల కేంద్రంలో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ శుక్రవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. తనిఖీలో భాగంగా సరైన పత్రాలు లేని వాహనాలకు అపరాధ రుసుం విధించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించరాదని, మద్యం సేవించి, అధిక వేగంతో వాహనాలు నడపరాదని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు.

మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలి


మహిళలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

ముదిగుబ్బ: మహిళలు ఆరోగ్యంపై దృష్టి సారించాలని డాక్టర్ రోజారాణి సూచించారు. మలకవేముల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం స్వస్థ్ నారి సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రోజారాణి క్యాన్సర్, క్షయ, కుష్టు, రక్తపోటు, మధుమేహం తదితర వాటిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ వేణుగోపాల్‌రెడ్డి, పీహెచ్ఎన్ మంజుల, సిబ్బంది అలివేలమ్మ, రవి శంకర్, భార్గవి, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

5న ఉచిత వైద్య శిబిరం

ధర్మవరం అర్బన్: అక్టోబర్ 5న పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో బెంగళూరు నేత్రజ్యోతి కంటి ఆసుపత్రి వైద్యులతో కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు యువర్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శీలా నాగేంద్ర, కార్యదర్శి జయరాం తెలిపారు. ఈ మేరకు వారు పట్టణంలోని స్వాతిక్లినిక్‌లో శుక్రవారం వైద్య శిబిరం కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో యువర్స్ ఫౌండేషన్ కోశాధికారి వంకదారి మోహన్, ఉపాధ్యక్షుడు సుంకు సుకుమార్, జాయింట్ సెక్రటరీ రమేష్‌బాబు, క్యాంపు చైర్మన్ వైకె శ్రీనివాసులు, డాక్టర్ బీవీ సుబ్బారావు, పీఆర్‌ఓ రాధాకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

సర్వ మతాలు సమానమే

- ఎస్పీ సతీష్‌కుమార్


సుగూరు ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఎస్పీ సతీష్‌కుమార్

హిందూపురం: సర్వ మతాలు సమానమేనని, అందరూ కలసి మెలసి ఉండాలని ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. హిందూపురంలోని సుగూరు ఆంజనేయ స్వామి దేవస్థానంలో శుక్రవారం ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అలాగే సీఅండ్‌ఐజీ చర్చి ఫాదర్ ఆశీర్వాదాలు పొందారు. తర్వాత ఆల్‌హిలాల్ మసీదులో ముస్లింలతో కలసి ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా మత పెద్దలతో మాట్లాడారు. హిందూపురంలో అందరూ సోదర భావంతో ఉండటం చాలా సంతోషకరమన్నారు. చిన్న చిన్న వాటికి మనస్పర్ధలకు తావులేకుండా ప్రశాంతంగా జీవించాలన్నారు. పోలీస్‌శాఖ ద్వారా ఎలాంటి సహకారం అవసరమైనా తాము అందించడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు.

ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి


చాకలి ఐలమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కదిరి టౌన్: పట్టణంలోని ఆర్అండ్‌బీ బంగ్లాలో తెలంగాణ వీరనారి చాకలి ఐలమ్మ 130వ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి చింతా నాగరాజు మాట్లాడుతూ భూమి కోసం భుక్తికోసం అనే నినాదంతో ఐలమ్మ పోరాటాలు చేసిందన్నారు. తన పోరాటం ద్వారా ఆనాటి పెత్తందారులు నుంచి పేదలకు భూములు ఇప్పించిందన్నారు. అనంతరం ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బీసీ ఉపాధ్యాయులు, నాయకులు గంగరాజు, ఇర్ఫాన్, సాయిశీనా, హరి, రమణ, నాగభూషణం, జవహర్ తదితరులు పాల్గొన్నారు.

వృత్తి విద్యాకోర్సులతో ఉపాధి అవకాశాలు


ఒకేషనల్ ట్రైనింగ్‌లో పాల్గొన్న విద్యార్థులు

కదిరి అర్బన్: వృత్తి విద్యాకోర్సులతో ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తాయని జీసీడీఓ సంపూర్ణ, ఒకేషనల్ కో ఆర్డినేటర్ మధు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో 9,10వ తరగతి విద్యార్థులకు శుక్రవారం ఆటోమోటివ్ రంగంలో ఇంటర్న్‌షిప్ కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలోని ప్రముఖ షోరూంలలో విద్యార్థులకు సేల్స్, సర్వీసెస్, స్పేర్ పార్ట్స్ వంటి వాటిపై ప్రత్యేక శిక్షణ అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లియాఖత్‌అలీ, ట్రైనర్ లావణ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ఎన్పీకుంట: గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెడ్‌కానిస్టేబుల్ మహేష్ హెచ్చరించారు. బత్తినిగారిపల్లిలో శుక్రవారం గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హెడ్‌కానిస్టేబుల్ సైబర్ నేరాల నివారణపై అవగాహన కల్పించారు. ఏవైన విపత్కర సమయాల్లో డయల్–100 కు ఫోన్ చేసి పోలీస్ సేవలు పొందాలని సూచించారు.

టీకాల పంపిణీపై ఏడీ ఆరా


గాలికుంటు వ్యాధిపై వివరాలు సేకరిస్తున్న ఏడీ కళావతి

పెనుకొండ: మండలంలో పశువులకు వేస్తున్న గాలికుంటు వ్యాధి నివారణ టీకాలకు సంబంధించి జిల్లా వెటర్నరీ బయోలాజికల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ విజయవాడకు చెందిన పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ కళావతి ఆరా తీశారు. శుక్రవారం పట్టణంలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో జేడీ గిరిజ, ఏడీ శ్రీరాములు నాయక్ ఇతర సిబ్బందితో సమావేశమయ్యారు. వ్యాక్సిన్ ఏ విధంగా వేస్తున్నారు, పశువ్యాధి నిర్ధారణ కేంద్రం అనంతపురం సిబ్బంది ఏ విధంగా రక్త నమూనాలు సేకరిస్తున్నారు తదితర విషయాలపై అడిగి తెలుసుకున్నారు. ఉపసంచాలకులు లక్ష్మీకాంతమ్మ ఆధ్వర్యంలో గొర్రెలకు బ్రూసల్లోసిస్ వ్యాధి నిర్ధారణకు రక్త నమూనాలు సేకరించారు. సిబ్బంది ప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అగళి: మండలంలోని పీ బ్యాడగేర పంచాయతీలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ప్రతి గ్రామంలోని పశువులకు టీకాలు వేయించుకోవాలని సూచించారు. వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వెటర్నరీ అసిస్టెంట్ శివకుమార్ తెలిపారు.

మహాలక్ష్మీ నమోస్తుతే


ఖాద్రీ ఆలయంలో రామావతార అలంకారం


బత్తలపల్లి టీచర్స్ కాలనీలో పూజలందుకున్న మహాలక్ష్మీదేవి


గౌరీ దేవి అలంకరణలో పట్నం వాసవీ కన్యకాపరమేశ్వరి

సాక్షి బృందం: దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలు సందడి సాగుతున్నారు. ఇందులో భాగంగా ఐదో రోజు శుక్రవారం ఆలయాల్లో అమ్మవార్ల మహాలక్ష్మిగా దర్శనమిచ్చారు. పెద్దసంఖ్యలో భక్తులు ఆలయాలకు చేరుకుని అమ్మవార్లను దర్శించుకున్నారు.


పుట్టపర్తిలో మహాలక్ష్మిగా దర్శనమిస్తున్న సత్తెమ్మ


ధర్మవరంలో ధనలక్ష్మిగా టీచర్స్ కాలనీ చౌడేశ్వరిదేవి


తలుపులలో గ్రీన్ బఠానీల అలంకారంలో వాసవీమాత


తనకల్లులో లక్ష్మీదేవి అలంకరణలో వాసవీమాత


ముదిగుబ్బలో మహాలక్ష్మి రూపంలో వాసవీమాత


అమడగూరులో స్కందమాతగా చౌడేశ్వరి అమ్మవారు

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

ధర్మవరం డివిజన్
7093150088, 7093157766
9912220726, 9912220717